నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
ఆదివారం | 26 మే 2024 | పేజీలు 8

### శ్రీవారిని దర్శించుకున్న

## భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ జైషా



**తిరుమల, మేజర్‌న్యూస్:**

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ జైషా తిరుమల వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకు జబన్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి వారిని శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు.



## అక్రమార్కులకు వరం

# గూడూరు డివిజన్

### యథేచ్ఛగా అక్రమాలు

**ముందుకు సాగని దర్యాప్తులు**

**పోస్టింగ్‌ల కోసం లాబీలు ప్రారంభం**

> **నేల నుంచి నింగిదాక మైకా.. రాకెట్ కేంద్ర(షార్).. సిరామిక్ విద్యాసంస్థ..నిమ్మ సాగు.. నీలి విప్లవం (ఆక్వాసాగు).. సిలికా గనులు తదితర సంస్థల నిలయంతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన గూడూరు డివిజన్ ఒకప్పుడు ఇక్కడ ఉన్న ప్రతిష్టాత్మక సంస్థల్లో పని చేయడం గొప్పగా చెప్పుకొనే వారు. అలాంటిది ఇప్పుడు గూడూరు డివిజన్‌లో పనిచేయడం కొన్ని శాఖల ఉద్యోగులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. దీంతో అక్రమార్కులకు గూడూరు డివిజన్ కేరాఫ్‌గా మారుతోంది.**

**గూడూరు, మేజర్‌న్యూస్:** వారు.. వీరు అన్న తేడా లేకుండా రాజకీయ నాయకులు, ఉద్యోగులు కుమ్మక్కై దోచుకొంటున్నారు. సహజ వనరులు, మినరల్స్, రవాణ, భూములు... ఇలా ఒక్కటేమిటి ప్రతిదీ వారికి కల్పతరువుగా మారుతున్నాయి. డివిజన్లో నాయకులు.. అధికారుల అవినాభావ బంధాలు అక్రమాలకు కేంద్ర బిందువుగా చెప్పవచ్చు. ఈ డివిజన్‌లో పని చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చేయి తడపడమో...నాయకుల ప్రాపకం కోసం వెంపర్లాడుతుంటారు. డివిజన్‌లో ఒక్కసారి పనిచేస్తే అదే జీవిత పరమార్థం అన్నట్లు తయారైంది. రెవెన్యూ, పోలీసు శాఖ ఏదైనా.. ఉద్యోగం ఎంతదైనా ఇక్కడ పని చేయడానికి ఉద్యోగస్తులు ఉవ్విళ్లూరుతుంటారు. గూడూరు డివిజన్‌లో ప్రతిష్టాత్మక సంస్థలు కనుమరుగై అవకతవకలకు నెలవుగా మారి అడ్డగోలు పనలుకు నిలయంగా మారిందన్న అరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు, గూడూరు, సైదాపురం, కోట, వాకాడు మండలాలు కేంద్రంగా అక్రమాలు సాగుతున్నాయి. చిల్లకూరు మండలంలో సిలికా గనులు, ప్రభుత్వ భూముల వ్యవహారంలో రెవెన్యూ యంత్రాంగం చేస్తున్న అక్రమాలు అన్నీ ఇన్ని కావంటే అతిశయోక్తి కాదు. సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఫలితాలకు ఎదురు చూస్తున్న సమయంలో ఇప్పటికే పలువురు అధికారులు గూడూరు డడివిజన్‌లో పోస్టింగ్‌ల కోసం నాయకుల ప్రాపకం కోసం విశ్వ ప్రయత్నాలు ప్రారంభించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో సిలికాన్ గనుల వ్యవహారంలో ప్రభుత్వం అడ్డగోలుగా గనులను ఏకీకృతం చేసి దోచుకోవడం తెల్సిందే ఈ సమయంలో గనుల యజమానులు సైతం ఏమీ చేయలేక ప్రభుత్వం చెప్పిన వారికే గనులను అప్పగించి చేష్టలుడిగి చూస్తుండి పోయారు. గనులు పొందిన వ్యక్తులు ప్రభుత్వ భూములు నామమాత్రపు ధరలకు లబ్దిదారుల నుంచి తీసుకుని నకిలీ బిల్లులతో కొల్లగొట్టినా మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మరోపక్క రెవెన్యూ అధికారులు కూడా లబ్దిదారుల భూములు ఇష్టారాజ్యంగా తవ్వి ఎత్తేస్తున్నా పట్టించుకోవడం లేదు. మరోపక్క రెవెన్యూ అధికారులు సెజ్‌కు భూముల సేకరణలో లేని భూములకు రికార్డులు సృష్టించి కోట్ల రూపాయలు నిధులు కైకర్యం చేయడం విశేషం. రెండు సంవత్సరాల క్రితం కృష్ణపట్నం పోర్టు భూముల్లో రికార్డులు తారుమారు చేసిన వ్యవహారం అధికారుల ప్రమేయంతో భూ కుంభకోణం జరిగిన వైనంపై కేసులు నమోదు చేసి బాధ్యులను అరెస్ట్ చేసి రెండు సంవత్సరాలు గడిచినా అతీగతి లేదు. మరోపక్క చిల్లకూరు మండలంలోని కడివేడు రెవెన్యూలో ప్రభుత్వంకి గనులు పడిన భూములను కాపాడడంలో రెవెన్యూయంత్రాంగం విఫలం కాడం 1970 నుంచి రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. ఇప్పటికీ ఆ రెవెన్యూలో భూ సంస్కరణల్లో దాఖలు పడిన భూములను అప్పట్లో భూములు ఇచ్చిన వారి వారసులమంటూ రెవెన్యూ యంత్రాంగం మద్దతుతో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పోలీసు శాఖ అందు గలదు..

మిగతా 2లో

## హింసాత్మక ఘటనలకు పాల్పడితే

# కఠిన చర్యలు తప్పవు

**ఓట్లు లెక్కింపు దృష్ట్యా సెక్షన్ 144, 30 పోలీసు యాక్ట్ అమలు**

**ఎన్నికల ఫలితాలు అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహణకు అనుమతులు లేవు**

**జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు**



వివరాలు 2లో

## ఎంతటి క్లిష్ట పరిస్థితినైనా అణచి వేయటానికి సిద్ధం

**శాంతిభద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్**

**చంద్రగిరి టవర్ క్లాక్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్... మాక్ డ్రిల్ నిర్వహణ**

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** ఎంతటి క్లిష్ట పరిస్థితులు నైనా,ఎలాంటి సవాళ్లు ఎదురైనా, అసాంఘిక శక్తులను అణిచి వేయుటకు పోలీస్ శాఖ సంసిద్ధంగా వుందని శాంతిభద్రతల అదనపు ఎస్పి కులశేఖర్ వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్., ఆదేశాల మేరకు పోలీసు శాఖ నైపుణ్యం, సామర్థ్యాలను సమాజానికి తెలియజేయడమే లక్ష్యంగా శనివారం సాయంత్రం చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణ పరిస్థితులను ఎదుర్కొని నమూనా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలలో కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు సెక్షన్ 144 ,సి.ఆర్.పి.సి, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు వుంటాయని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా లూజు పెట్రోలు, డీజిల్, బాణసంచా అమ్మకాలు నిషేధించి నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహణకు అనుమతి లేదన్నరు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని, అదే విధంగా సెక్షన్ 144 సి ఆర్ పి సి, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ కూడా అమలులో ఉంటాయన్న తెలియజేశారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే

మిగతా 2లో



# ఎంతటి క్లిష్ట పరిస్థితినైనా అణచి వేయటానికి సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అట్టి వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో ప్రజలకు తెలియజేసేందుకు ఇక్కడ మాక్ డ్రిల్ చేసామని చెప్పారు. కౌంటింగ్ రోజు అందరూ క్రమశిక్షణతో మెలిగి పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కౌంటింగ్ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లను అవసరమైన మేరకు బైండోవర్, హౌస్ అరెస్ట్ చేస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీలు శరత్ రాజ్ కుమార్ చంద్రగిరి, రవీంద్రారెడ్డి ఏఆర్, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# అక్రమార్కులకు వరం... గూడూరు నియోజకవర్గం

(మొదటిపేజీ తరువాయి)

ఇందు గలదు ఎందెందు వెతికినా అవినీతి దర్శనం ఇస్తుంది. సిలికా ఇసుక, తెల్లరాయి, గ్రావెల్ ఏది వదలకుండా ఇసుకలో తైలం తీయగలరన్నట్లు ప్రతిదీ మామూళ్ల మత్తులో అక్రమ రవాణాకు దారులు కాపలా కాస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. దీనికోసం నాయకులు, అధికారుల ప్రాపకం కోసం వారు పడేపాట్లు వర్ణనాతీతం. 16వ నంబరు జాతీయ రహదారిపై సాగుతున్న అక్రమ రవాణా వెనుక పోలీసు శాఖలోని కిందస్థాయి సిబ్బంది నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు మామూళ్లు చేరుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పెన్నా, స్వర్ణముఖి ఇసుక రవాణ కోసం ఓ కానిస్టేబుల్ జాతీయ రహదారిపై ఉన్న అన్ని స్టేషన్లతో పాటు, జిల్లా అధికారికి మామూళ్లు ఇస్తున్నట్లు పేర్కొంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జాతీయ రహదారి వెంట వెళ్లే గ్రానైట్, బొగ్గు రవాణ సమయంలోనూ రవాణా, తూనికల కొలతల శాఖ అధికారులు పోలీసులకు తోడై తమ పబ్బం గడుపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు, రెవెన్యూ, రవాణ, ఇతర శాఖల అధికారులకు కల్పతరువుగా మారిన గూడూరు డివిజన్‌లో పోస్టింగ్‌ల కోసం ఇప్పటి నుంచే అధికారులు పెద్దఎత్తున లాబీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా డివిజన్‌లో ఏ అధికారులు పోస్టింగ్‌లు సాధిస్తారో ఎవరు ఉంటారో ఎవరు బదిలీలకు గురౌతారో చూడాల్సి ఉంది.

# విద్యార్థుల్లో నైపుణ్యతకు చదరంగం పోటీలు ఉపయోగపడుతుంది

**- చిల్డ్రన్స్ చెస్ అసోసియేషన్ సభ్యులు సురేష్ బాబు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం బాలికల ఉన్నత పాఠశాలలో 5 సం నుండి 15 సం బాలబాలికలకు ఉచిత చదరంగం శిక్షణ కార్యక్రమంను చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ శ్రీకాళహస్తి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. చెస్ అసోసియేషన్ సభ్యులు సురేష్ మాట్లాడుతూ పిల్లల్లో మేధస్సు జ్ఞాపకశక్తి మెరుగు పరచడానికి చదరంగం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. గత 24 సంవత్సరాల నుండి మా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగంలో శిక్షణలను నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. పట్టణ ప్రజలు తమ పిల్లలను చేర్పించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# రాజనాల బండపై ప్రత్యేక పూజలు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ ప్రసన్న ఆంజనేయస్వామి లక్ష్మీ నరసింహ స్వామి శనివారం పూజలు అందుకున్నారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో రాజనాల బండ కిక్కిరిసిపోయింది. పలువురు ప్రమాణాలు చేయగా మరి కొందరు వాయిదాలు వేసుకుని వెళ్లారు ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివార్లకు విశేష అభిషేకము అలంకరణ గావించారు రాష్ట్రంతో పాటు తమిళనాడు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.



# నాటకాల...నాని...!

**- నామినేషన్ రోజునే నా కారుపై రాళ్లతో దాడి**
**- వాళ్లలా దాడి చేయించే సంస్కృతి నాది కాదు**
**- అధికారం కోసం అడ్డగోలుగా నటించడం నాకు తెలియదు**
**- నాని నాకు రాజకీయ ప్రత్యర్థే కానీ.. శత్రువు కాదు**
**- కారు మీద దాడి జరిగితే.. కాలు విరిగినట్టు డ్రామాలా..?**
**- అందరితో కలసి ఆందోళన చేసిన వ్యక్తి అకస్మాత్తుగా ఆసుపత్రికి చేరడం ఏమిటి ?**
**- కార్యకర్తలను గొడవలకు ప్రేరేపించడం నాయకుని లక్షణమా**
**- స్విమ్స్‌లో నాని అనుచరులు వీరంగం చేస్తూ రోగులను భయపెట్టడం దేనికి సంకేతం**
**- మీడియా సమావేశంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి**

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్ :** చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని అధికారం కోసం ఆది నుంచి అడ్డగోలుగా వ్యవహరిస్తూ.. ప్రతి విషయాన్ని గొడవలకు దారి తీసేలా చేస్తూ అనుక్షణం కయ్యానికి కాలు దువ్వుతూ వచ్చాడు.. అయినా ఓపికతో భరించాం.. నామి నేషన్ రోజు నేను నా కుమా రుడు వెంట ఆర్వో కార్యాల యంకు వెళితే.. నేను వెళుతున్న కారుపై రాళ్ల దాడి చేయించి ఆ రోజే గొడవలకు ఆజ్యం పోశాడు.. అయినా అక్కడ ఘర్షణ జరగకూడదని భావించి మా పార్టీ నాయకులను సర్దుబాటు చేసుకుని సంయమనంతో వచ్చేశాను.. అలా కాకుండా నా కారుపై రాళ్లు పడగానే నేను కిందకు దిగి గొడవను ప్రేరేపించుంటే నాపై దాడి జరిగేది.. నా గన్ మెన్ల తుపాకీ తూటాలకు అమాయకులు బలైపోయేవారు.. అవన్నీ ఆలోచించే అందరినీ కంట్రోల్ చేసి వచ్చేశాను.. ఆ తర్వాత పోలింగ్ రోజున ఎక్కడ పడితే అక్కడ రెచ్చగొట్టి మాట్లాడారు.. అయినా ఓపికతోనే ఉన్నాం.. ఆ తర్వాత వైసీపీ సర్పంచ్ ఇంటిని దగ్గరుండి దగ్ధం చేయించి రాక్షసత్వాన్ని ప్రదర్శించారు.. అప్పటికీ మౌనంగానే ఉన్నాం.. మా పార్టీ నాయకునికి అండగా వెళ్లిన నా కుమారుడు మోహిత్ రెడ్డి కారుపై దాడి చేయడమే కాక అతని వెంట వెళ్లిన కారును తగులబెట్టారు. అప్పటి వరకు మౌనంగానే ఉన్న మా పార్టీ నాయకులు ఆ తర్వాత మహిళా యూనివర్శిటీ వద్ద పులివర్తి నాని కారుపై దాడి చేశారే తప్ప ఆయనపై ఎక్కడా దాడి జరగలేదు.. అలా చేయడం కూడా తప్పే కనుక చట్ట ప్రకారం శిక్ష అనుభవిస్తున్నారు.. కారుపై దాడి జరిగితే కాలు విరిగినట్టు నాటకమాడటం.. ఆపై డ్రస్ మార్చుకుని ఆసుపత్రికి చేరడం.. ఆ వెంటనే వెంటిలేటర్ పెట్టుకోవడం వంటివి చూస్తుంటే పులివర్తి నానిని జనమంతా అనుకుంటున్నట్లు నాటకాల రాయుడు అయ్యాడని.. అవన్నీ నాయకుని లక్షణాలు కాదు.. నాయకుడు అంటే బాధ్యత.. ప్రజలకు మంచి చేయలన్న తపన.. మంచి సమాజాన్ని నిర్మించాలన్న తపన ఉండాలే తప్ప ఇలా తన అనుచరులతో గొడవలు ప్రేరేపించడం కాదు.." అంటూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు.



తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంట గ్రామంలోని ఆయన నివాసం వద్ద శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రగిరి నియోజకవర్గం ప్రజలను కష్టంలో గాలికి వదిలేసి, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు నామినేషన్ రోజు నుంచి పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డిలు ఎలా నాటకాలు ఆడుతూ మభ్య పెట్టేందుకు ప్రయత్నం చేశారో వీడియోలు ద్వారా మీడియా ప్రతినిధులకు చూపించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ చంద్రగిరిలో ఎలాగైనా గెలవాలన్న తపనతో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి పులివర్తి నాని ఇష్టానుసారంగా రెచ్చగొట్టి మాట్లాడారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ఎవరి ఓటు హక్కు వారు వినియోగించుకోవాలని కోరుకున్నామే తప్ప ఎక్కడా గొడవలు సృష్టించలేదని అన్నారు. పోలింగ్ తర్వాత కూడా అన్ని పార్టీల నాయకులు స్నేహ భావంతో కలసి మెలసి ప్రశాంతంగా ఉండాలని కోరుకునే వ్యక్తినే తప్ప తనకు దాడులు చేయడం చేయించడం రెండు తెలియవన్నారు.తాను ఏపని చేసినా కష్టపడటం, ఆ తర్వాత దేవుడిని నమ్ముకుని వెళ్లడం మాత్రమే తెలుసు. రాజకీయాల్లో కూడా అలాగే ముందుకు వెళుతున్నా, నా కుమారుడు మోహిత్ రెడ్డిని కూడా అలాగే పెంచాను.చంద్రగిరి నియోజకవర్గం రాజకీయాల్లోకి వచ్చిన పులివర్తి నాని నాకు రాజకీయ ప్రత్యర్థే కానీ శత్రువు మాత్రం కాదని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. రాజకీయాల కోసం గ్రామాల్లో గొడవలు పెట్టడం తనకు తెలియదని, ఓ స్నేహ పూర్వక వాతావరణంలో రాజకీయాలు చేయడం మాత్రమే తెలుసన్నారు. నాయకునిగా ప్రజలకు మంచి చేయడం అలవాటు చేసుకోవాలి తప్ప ఇలా ఘర్షణలకు పాల్పడటం ఎవ్వరికీ మంచిది కాదంటూ తన ప్రత్యర్థి పులివర్తి నానికి హితవు పలికారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో కయ్యానికి కాలు దువ్వుతూ రెచ్చగొట్టినది ఎవ్వరో ప్రజలు అందరికీ తెలుసన్నారు. అధికారం చేతిలో ఉన్నా ఐదేళ్లు ఆ పార్టీలో ఎవ్వరికీ ఏ నష్టం చేయలేదని, అలాంటిది ఎన్నికల సమయంలో దాడులు చేస్తామంటే ఎవ్వరు నమ్ముతారున్నారు. పులివర్తి నాని కుటుంబీకులు ఆడుతున్న రాజకీయ నాటకంలో అమాయకులైన యువత బలైపోతున్నారన్న ఆవేదనతోనే ఈ వీడియోల ద్వారా నిజాలను చూపించాల్సి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆరు మండలాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికలు 2024 ఓట్లు కౌంటింగ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా, అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో జిల్లా పోలీసులు సన్నద్ధత, దీటుగా ఎదుర్కొనుటే ముఖ్య ఉద్దేశంగా జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, పర్యవేక్షణలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలిసులు శనివారం పుంగనూరు పట్టణంలో గోకుల్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్ – మాక్ డ్రిల్ నిర్వహించి, ఓట్లు లెక్కింపు వేళ అల్లర్లు, ఆందోళనలు, విధ్వంసలకు పాల్పడితే పోలీసులు తీసుకునే చర్యలపై మాబ్ డ్రిల్ ద్వారా జిల్లా పోలీసులు వివరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఆరిఫుల్లా, అడిషనల్ ఎస్పీ ఏ.ఆర్. జి.నాగేశ్వర రావు, ఎస్. సి.ఎస్. టి.సెల్ డి ఎస్పీ విష్ణు రఘువీర్, పుంగనూరు అర్బన్ ఇన్స్పెక్టర్ రాఘవ రెడ్డి ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## శనీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో శనీశ్వర స్వామికి శనివారం సందర్భంగా స్వామి వారికి పాలు పెరుగు తేనె పంచామృతం చందనం విభూది పలు రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో శాస్త్రోక్తకంగా అభిషేకించారు. అనంతరం పలు రకాల సుగంధ పరిమళ పుష్పాలతో స్వామి వారిని శోభమయంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కృతులతో మంత్రోచ్చారణలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అభిషేకాది కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## ప్రజలందరు సుభిక్షంగా ఉండాలి

**- గౌహతిలో అమ్మవారిని దర్శించుకొని వేడుకున్న మాజీ మంత్రి అమరనాథ రెడ్డి**



**పలమనేరు, మేజర్‌న్యూస్:** ప్రజలందరు సుభిక్షంగా సంతోషంతో ఉండాలని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి వేడు కున్నారు. అస్సాంలోని గౌహతిలో వెలసిన ప్రసిద్ధ క్షేత్రమైన కామాఖ్య అమ్మవారిని ఆయన శనివారం ఉదయం దర్శించు కున్నారు. ఎన్నికలలో బిజీగా గడిపిన ఆయన రెండు రోజుల క్రితం పుణ్యక్షేత్రాల సందర్శనార్థం వెళ్లారు. అందులో భాగంగా అస్సాం నీలచల్ హిల్స్‌లోని కామాఖ్య అమ్మవారిని ఆయన దర్శించుకొని వేడుకున్నారు. ఆ అమ్మవారి కృపాకటాక్షాలతో అన్ని వర్గాల ప్రజలు ఆయు రారోగ్యాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు.

## హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యా లయం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం పరిశోధక విద్యార్థి కె.హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆచార్యులు డా. డి.గౌరీ శంకర్ రెడ్డి మార్గదర్శకత్వములో " అనాలసిస్ ఆఫ్ మోడిఫైడ్ వాటర్ ఇండెసెస్ ఫర్ సర్ఫేస్ వాటర్ డిటెక్షన్ ఇన్ ల్యాండ్ సాట్ - 8 ఇమేజరీ" అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు పరిశోధకులు శుభాకాంక్షలు తెలిపారు.

## విత్తన వేరుశనగ కాయలు పంపిణీ



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని శెట్టిపేట గ్రామపంచాయతీ సచివాలయం చారాల నందు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎవ రైతే టోకెన్లు తీసుకున్నారో, వారికి శెట్టిపేట సర్పంచ్ ఓబుల్ రెడ్డి చేతుల మీదుగా వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెరికల్చర్ అసిస్టెంట్ పాపయ్య రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకులు బాలసుందరం రెడ్డి మృతి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జడ్పిటిసి సీపీ.బాలసుందరం రెడ్డి శనివారం ఉదయం వేలూరు సీఎంసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారి కుటుంబీకులు తెలిపారు. శనివారం సాయంత్రం మూడు గంటలకు స్థానిక గుండుబావి ఎదురుగానున్న శ్రీవాణి కళాశాల ప్రాంగణంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచి ఆది వారం మధ్యాహ్నం 1గంటకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# దేవస్థానంలో సీఆర్ఓ కార్యాలయం ప్రారంభోత్సవం

**చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి దేవస్థానం ఆవరణలో నాలుగవ గేటు వద్ద నూతన సిఆర్ఓ కార్యాలయాన్ని శనివారం లాంఛనంగా ఆలయ ఈవో నాగేశ్వరరావు, చైర్మన్ శ్రీనివాసులు సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, అనంతరం ఈ సిఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన పూజాది కార్యక్రమంలో ఇవో నాగేశ్వరరావు. చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు, సి ఆర్ ఓ కార్యాలయం ద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని వారు భక్తులకు తెలియజేశారు. ఈవో నాగేశ్వరరావు, చైర్మన్ శ్రీనివాసులు, సంయుక్తంగా మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థానం ఆవరణలో నాలుగో గేటు నందు, నేడు నూతనంగా సిఆర్వో కార్యాలయాన్ని ప్రారంభించామని, ఈ కార్యాలయం ద్వారా భక్తుల వసతికి కావలసిన వివిధ గృహాలు ఇక్కడ లభ్యమవుతుందని, ఈ ప్రాంతం నందు సిఆర్ఓ కార్యాలయం ప్రారంభించడం ద్వారా భక్తులకు అనువుగా ఉండి వారికి వసతి గృహాలు పొందడానికి వీలుగా ఉంటుందని ,కాబట్టి భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వారు కోరారు.



## వేణుగోపాల స్వామిని దర్శించుకున్న పుత్తూరు మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగర్‌లో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారిని శనివారం పుత్తూరు మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్ రెడ్డి దంపతులు పేరుమీద అర్చన చేసిస్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను గురించి టిటిడి అర్చ కులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోమాతకు అరటి పండ్లు పెట్టి తినిపించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బంధువులు, ఏఈఓ హేమాద్రి, టిటిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో కోడ్ ఉల్లంఘనలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికారులు కోడ్ ఉల్లంఘనలపై నిఘా పెట్టారు. కేసులు కూడా నమోదు అవుతున్నాయి. అయితే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో మాత్రం ప్రతిరోజు ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. ఆలయ ఇఓగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఉన్నారు. సుదీర్ఘకాలం రెవిన్యూలో పనిచేశారు. ఎన్నికల నిర్వహణ కార్యక్రమాలు చేపట్టిన అనుభవం కూడా ఉంది. ఎన్నికల కోడ్ గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. అయినా ఉల్లంఘన కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో నాయకులు పాల్గొనకూడదు. నాయకులతో కలిసి ఇఓ కూడా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బోర్డు కార్యాలయానికి రావడం, అధికారులు, సిబ్బందితో చర్చించడం, పనులు పరిశీలించడం, ప్రారంభోత్సవాలు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందా లేదా అనేది ఎన్నికల అధికారులు తేల్చాల్సి ఉంది. రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో స్థానికం గానే ఉన్నారు. ప్రతిరోజు పత్రికల్లో టీవీల్లో నాయకులు పాల్గొన్న కార్యక్రమాలు వస్తూనే ఉన్నాయి. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందా లేదా అనేది రిటర్నింగ్ అధికారి స్పష్టం చేయాల్సి ఉంది.

# సమాచార హక్కు చట్టం అంటే అంతచులకనా?

**విధినిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత ఎక్కడ?**

**- ముప్పై రోజులైనా సమాచారం ఇవ్వని పౌరసమాచార అధికారి**

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** తమ విధి నిర్వాహణలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని కేంద్రప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకొచ్చినది. మీరు పబ్లిక్ సర్వెంట్స్ కాబట్టి ప్రజలకు జవాబుచెప్పాల్సిన అవసరం మీకుంది కాబట్టి , మీరు చేసే ప్రతి పనిలోను పారదర్శకత ఉండాలని ఈ చట్టాన్ని రూపొందించారు.ఐతే కొందరు అధికారులు రాజకీయ రాబందులను అడ్డుపెట్టుకుని, చట్టాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోటి మునిరత్నం మాట్లాడుతూ చౌడేపల్లి పట్టణంలో బస్టాండ్ నుండి ఏ.పి.యస్. ఆర్టీ.సి బస్టాండ్, చిట్టి చెరువు వరకు దేవాదాయ భూములు విస్తరించినట్లు రికార్డులు తెలుపు చున్నాయి.ఐతే కొందరు రాజకీయ నాయకులు తమ అధికార బలాన్ని ఉపయోగించి ఆక్రమించుకున్నారు.వాటిని తిరిగి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలి. అంతే కాకుండా సర్వే నెంబర్ 180/8బి లో 1.99 సెంట్లు పోరంబోకు భూమి కలదు అందులో జర్నలిస్టులకు కొంతమందికి ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగింది. అందులో ఎంత మందికి పట్టాలు ఇచ్చారు. ఎవరెవరికి ఇచ్చారు. ఎంతమంది అన్యాక్రాంతం చేశారు. అన్యాక్రాంతం చేసిన వారిపై రెవిన్యూ శాఖ తీసుకొనే చర్యలు, దేవాదాయ భూముల ఆక్రమణ దారులపై తీసుకొనే చర్యలు వివరాలు కోరుతూ ఉత్తరాది హరిప్రసాద్ 24 ఏప్రిల్ 2024న చౌడేపల్లి సచివాలయం 2 పౌర సమాచార అధికారి(చౌడేపల్లి పంచాయతీ కార్యదర్శి)ని కలిసి సమాచార హక్కు చట్టం 2005 దరఖాస్తును సమర్పించడం జరిగింది. సమాచారం సదరు కార్యాలయంకి సంబంధించినది కాకపోతే సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(3) ప్రకారం సంబంధిత కార్యాలయానికి ఐదురోజులలో బదిలీ చేయాలని పౌరసమాచార అధికారికి తెలియదా? 25 రోజులు గడచిన తర్వాత మీ దరఖాస్తును గ్రామరెవెన్యూ అధికారికి బదిలీ చేశానని చరవాణిలో చెప్పడం చట్టం పైన పౌరసమాచార అధికారి(చౌడేపల్లి పంచాయతీ కార్యదర్శి)కి ఎంతటి గౌరవం ఉందో ఇట్లే తెలిసి పోతుంది. సమాచార హక్కు చట్టాన్ని గౌరవించలేని అధికారుల పై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలి,అలాగే ఉన్నతాధికారులు సమాచార హక్కు చట్టం పైన పౌరసమాచార అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కంగుంది శివకుమార్, రామాంజులు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# పులివర్తి నానిని పరామర్శించిన పలువురు టీడీపీ నాయకులు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గం ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షుడు పులివర్తి నానిని శనివారం స్థానిక చిత్తూరు నగరం లోని బీవీ రెడ్డి కాలనీ నందు గల పులివర్తి నాని స్వగృహంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి జిల్లా అధ్యక్షుడు సి ఆర్ రాజన్, చిత్తూరు నియోజకవర్గ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం తిరుపతి నగరం లోని స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సమీపంలో వైసీపీ అల్లరి మూకలు చంద్రగిరి నియోజకవర్గ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పై దాడి చేసిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన పులివర్తి నాని త్వరగా కోలుకోవాలని, ఆయనకు చిత్తూరు జిల్లా టీడీపీ నాయకుల అండ ఉంటుందని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునేంతవరకు పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైటర్డ్ ఐపీఎస్ పి చిన్నస్వామి, వన్నియకుల క్షత్రియ సంఘం నాయకులు విజయకుమార్, టిడిపి నాయకులు జయచంద్ర నాయుడు, అమరేంద్ర, దేవా తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి నియోజకవర్గం ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

## ధర్మరాజుల ఆలయంలో ఇలామంతు బలి

**కార్వేటినగరం, మేజన్ న్యూస్:** కార్వేటినగరం మండలం కత్తిరి పల్లి పంచాయతీలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో మహా భారత ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద హరికథ పద్మవ్యూహం ఉభయ దారులు పి గుణదామ రెడ్డి, విమలమ్మ రిటైర్డ్ ఇరిగేషన్ ఆఫీసర్. సాయంత్రం ఇలామంతుని బలి ఉభయ దారులు. బాబు రెడ్డి , ప్రమీల. రాత్రి నాటకం శ్రీకృష్ణరాయబారం ఉభయదారులు పాదరి కుప్పం గ్రామస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహిళలు భక్తులు ఉభయ దాతలు పాల్గొన్నారు.





## వైసీపీ శ్రేణులు రౌడీయిజం మానుకోవాలి

**- టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి**

**రామకుప్పం, మేజర్‌న్యూస్:** వైసీపీ శ్రేణులు రౌడీయిజంకు స్వస్తి చెప్పి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగేలా చూస్తాం అని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పత్రా నారాయణ చారి పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి ప్రధాన కార్యదర్శి నరసింహులు మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, నేతలు రామ్మూర్తి, మనోహర్, గజేంద్ర, లోకేష్, ప్రకాష్, బాబులు హితవు పలికారు. శనివారం రామకుప్పంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధి 89పెద్దూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేతలు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రశాంతంగా ఉన్న కుప్పం నియోజకవర్గం లోని గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు అలజడులు సృష్టిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతోందన్నారు. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలను ఐదేళ్ల పాటు భరించిన జనం ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి పాడి కట్టేలా తీర్పు ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు, కార్యకర్తలు గుర్తించి జాగ్రత్తగా వుండాలి అని పెరుగొనరు, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

## మూడవ అంతర్జాతీయ సదస్సు విజయ వంతం

**- సీతమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటా చలపతి**

**చిత్తూరుఅర్బన్, మేజర్‌న్యూస్:** నగరంలోని శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ స్టడీస్ నందు మూడవ అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని సీతమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటా చలపతి తెలిపారు. ఇంజనీరింగ్, సైన్స్లో పురోగతి ఆవిష్కరణలు అనే అంశం శుక్రవారం, శనివారం రెండు రోజులపాటు నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రజని, నెల్లూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ ఇమేజ్ ప్రాసెసింగ్ అప్లికేషన్ల గూర్చి వివరించారు. ఇమీట్ ప్రాసెసింగ్‌లో ఫోరియర్ ట్రాస్ఫిర్మేషన్ ఉపయోగించడం ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నికలను ఉపయోగించి ఇమెట్లను ఎలా మెరుగుపరచాలి. చిత్రాలను మెరుగుపరచడానికి ఉపయోగించే వినూత్న పద్ధతులు అనే అంశం పై విద్యార్థులకు వివరించారు. కావున ప్రతి విద్యార్థి నేటి ఆధునిక ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి విశిష్ట సాంకేతికతలను నేర్చుకోవాలి ఇంజనీరింగ్ విద్యార్థులకు వివరించారు. అనంతరం సీతమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్. వెంకట చలపతి మాట్లాడుతూ ఈ సమావేశం విజయవంతంగా పూర్తి చేసినందుకు విద్యార్థులు అధ్యాపకుల సహకారాన్ని అభినందించారు. విద్యార్థులకు విలువైన జ్ఞానాన్ని పంచి, సహకరించినందుకు వక్తలకు దన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ అకడమిక్ డీస్ డాక్టర్ ఎం. శిరవణస్, ప్రోగ్రామ్ కో కన్వీనర్లు డా. గోపి, డా. హెచ్. ఉమా మహేశ్వర అధ్యాపకులు, బి.టెక్ ఇంజినీరింగ్, యంబిఎ, ఎంసిఎ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు చైర్మన్ రంగనాదం, మేనేజింగ్ ట్రస్ట్ డిఎ. కల్పజ, సెక్రటరీ డికె బద్రి నారాయణ అభినందించారు.



ముఖ్యఅతిథి రజనిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి ఇతర సిబ్బంది

## ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

**- విద్యార్థి సంఘం నాయకులకు డిమాండ్**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణంలో ప్రైవేటు. కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందక ముందే అడ్మిషన్లు ప్రారంభించి, అధిక మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల రక్తాన్ని జలగల పిలుస్తూ ,విద్యార్థుల భవిష్యత్తులతో ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబీకులైన తాము నేడ కార్పొరేట్ పాఠశాలలో మోజుతో కార్పొరేట్ పాఠశాలలో విద్య నేర్పించాలని ఆసక్తితో నేడు కార్పొరేట్ పాఠశాలలో చేర్పించడానికి వెళుతున్న సమయంలో కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలో వారికి ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులను వసూలు చేస్తూ తమను పూర్తిగా స్వాహా చేస్తున్నారంటూ, ఇకనైనా దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలపై దృష్టి సారించాలని, వారు చేస్తున్న మోసాలను గుర్తించి, తద్వారా విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలని వారు కోరారు విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ నేడు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అందించాలని ప్రభుత్వ జీవోలున్న ఏ ఒక్క పాఠశాలలోనూ కనీసం ఐదు శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడం లేదని, అదే విధంగా కార్పొరేట్ పాఠశాలలో సమాచార చట్టం సూచిక బోర్డు ఫీజుల పశువులపై సూచిక బోర్డులు లేకుండా వారికి ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేస్తూ అటు విద్యార్థులు తల్లిదండ్రుల సొమ్మును చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని, ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ,ప్రైవేటు కార్పొరేటర్ పాఠశాలలపై విచారణ కొనసాగిస్తే, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల చేస్తున్న మోసాలు బయటపడతాయని, కనీసం ఏ ఒక్క పాఠశాలల్లోనూ సమాచార చట్టం సూచిక బోర్డు, ,ఫీజు వసూళ్ల సూచిక బోర్డులు లేవని ,శ్రీకాళహస్తి పరిధిలోని కార్పొరేట్ పాఠశాలల్లో ఎంతమంది పేద విద్యార్థికి ఉచిత అందిస్తున్నారో విద్యాశాఖవి అధికారులు తెలియజేయాలని, వారు విదేశాలకు అధికారులను ప్రశ్నించారు, ఇకనైనా విద్యాశాఖ అధికారులు మేలుకోకపోతే, విద్యార్థి సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఏపీ డిప్యూటీ సీఎం బోడి ముత్యాలనాయుడు., ఏపీ మంత్రి మెరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు బ్రిజేంద్రనాథ్ రెడ్డి, అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసులు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

## రాబోయేది కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వమే

**- ఎంపీ అభ్యర్థి చింతా మోహన్**

**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** రాష్ట్రంలో , కేంద్రంలో వైసిపి , బిజెపి పార్టీలకు అనుకూల పరిస్థితులు లేవని ప్రజల మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ వెల్లడించారు. శనివారంగూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను అనేక విధాలుగా ప్రభావితం చేశారని అయితే విజ్ఞతతో ఓటర్లు ఓటు వేశారని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వెంటనే దుగరాజపట్నం పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ రామకృష్ణారావు పూల చంద్రశేఖర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





# ధ్యానంతో ఒత్తిడికి చెక్...

- ఒత్తిడి తోఅధిక రక్తపోటు వచ్చే అవకాశం
- ప్రాణాంతకమైన గుండె జబ్బులు
- ధ్యానంతో ఆయు ప్రమాణం పెంపు
- ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వనజాక్షమ్మ



**నేటి** ఉరుకులు పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత కొరవడంతో రకరకాల వ్యాధులకు గురవుతున్నారు. చాలామంది చిన్నపాటి ఆరోగ్య సమస్యలను పెద్దవిగా ఊహించుకుని పరిస్థితిని జటిలం చేసుకుంటున్నారు. దాని గురించి నిరంతరం తీవ్రంగా ఆలోచిస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. లేని దానిని ఊహించుకుంటూ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు.దీని నుంచి బయటపడాలంటే ధ్యానం అత్యంత ప్రధాన మార్గంగా పలువురు వైద్యులు సూచిస్తున్నారు. భారతీయ సంస్కృతిలో వేద కాలం నుంచి ధ్యానం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ధ్యానం ద్వారా ఒత్తిడిని, ఆందోళనలను రక్తపోటును వివిధ రకాల వ్యాధుల నుండి కోలుకోవడంలో ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందన్నటున్నారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతను నియంత్రించుకోవచ్చునని పలువురు సూసిస్తున్నరు. సమాజంలో ఆస్తులు, అంతస్తులు, ఐశ్వర్యాలతో మానవుడు సుఖ జీవనాన్ని గడపలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీనికంతటికీ కారణం నిలకడ లేని మనస్తత్వం, ఒత్తిడి, దిగాలు లాంటి వాటితో సతమతమవుతూ అనారోగ్యాల బారిన పడి కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం ప్రపంచంలో ఏది సాటి రాదన్న పెద్దల సామెతను ప్రస్తుత పరిస్థితులు అద్దం పడుతున్నాయి. ప్రతి మనిషి ఏదో ఒక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, కూడ బెట్టిన ధనాన్ని వృధా చేస్తూ కాలం వెల్ల దీస్తున్నారు. పూర్వీకులు పాటిస్తున్న ఆరోగ్య నియమాలను తుంగలో తొక్కి నవీన పద్ధతులను అవలంబించి మానవుడు తన ఆరోగ్యాన్ని తానే పాడు చేసుకుంటున్నారు. చిరుధాన్యాలను పక్కనపెట్టి బయటి ఆహారానికి అలవాటు పడి ఆయు ప్రమాణాలను తానే తగ్గించుకుంటున్నారు. ధ్యానాన్ని విస్మరించడంతోమనిషి ఇతర అలవాటులకు గురై నిద్రలేచినది మొదలు నిద్రకు ఉపక్రమించే వరకు ఏదో ఒక ఒత్తిడితో బాధపడుతు న్నారు అనడంలో సందేహం లేదు. ప్రతి పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులకు రోజుకు ఒక గంట పాటు ధ్యానం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతై నా ఉంది. ఇదే రీతిలో ప్రతి వైద్యశాలల్లో విధిగా ఆరోగ్య సిబ్బందిచే ధ్యానం యొక్క ప్రయోజనాల గురించి విపులంగా వివరించాలని పలువురు అంటున్నారు. మనిషి యొక్క ఆయు ప్రమాణం పెరగాలంటే ఒత్తిడిని జయించి ధ్యానం వైపు దృష్టిసారించినప్పుడే సాధ్యమవుతుందని పలు అధ్యయనాల్లో మేధావులు పేర్కొంటున్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మనిషి యొక్క సగటు ఆయు ప్రమాణాన్ని పెంచడానికి ధ్యానం పట్ల మొగ్గు చూపే విధివిధానాలను జిల్లా అధికారులకు సూచించాలని పలువురు కోరుతున్నారు.



**- ఆహార నియమాలను విధిగా పాటించాలి**
**: సిమ్స్ ప్రముఖ కార్యాలజిస్ట్ వనజాక్షమ్మ**

నేటి సమాజంలో ఆహారపు అలవాట్లను ప్రతి ఒక్కరూ మార్చుకోకపోవడంతో ప్రాణాంతకమైన గుండె జబ్బులు, అధిక రక్తపోటులకు, ఇతర వ్యాధులకు గురవుతున్నారని, దీంతో లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయని సిమ్స్ ప్రముఖ కార్యాలజిస్ట్ డాక్టర్ వనజాక్షమ్మ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రతి మనిషి తన జీవన శైలిలో మార్పులు తెచ్చుకుంటే తప్ప వ్యాధుల భారీ నుండి తప్పించుకునే పరిస్థితులు లేవని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. బయటి ఆహారాన్ని మానుకోవాలని, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆమె సూచించారు. మసాలాల వాడకాన్ని తగ్గించుకోవాలని, ఒత్తిడిని జయించాలంటే ప్రతి ఒక్కరూ ధ్యానానికి అలవాటు పడాలని ఆమె కోరారు. అధిక ఒత్తిడితో హృద్రోగ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని దీనిని తగ్గించుకోవాలంటే ధ్యానం ఒక్కటే పరిష్కార మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లను మార్పు చేసుకుని ధ్యానం వైపు దృష్టి సారిస్తే మనిషి యొక్క ఆయు ప్రమాణం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, భావితరాల వారికి ఇటువంటి అలవాట్లు మార్గదర్శకం కావాలని ఆమె వెల్లడించారు.

– వెదురుకుప్పం, మేజర్‌న్యూస్



## నడకతో మనిషి ఆరోగ్యం నడత మార్పు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నిత్య నడక చేపడితే మనిషి ఆరోగ్యంతో పాటు సబ్ ప్రవర్తన కలిగిన నడత అలవడుతుందని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శనివారం ఉదయం వినాయక సాగర్‌లో వాకర్స్‌తో కలిసి అభివాదం చేసుకుంటూ ఆరణి శ్రీనివాసులు నడిచారు. ఆరణి శ్రీనివాసులును వాకర్స్ అడ్వాన్స్ అభినందనలు తెలియజేశారు. వాకర్స్ అభినందనలు స్వీకరిస్తూ చిరునవ్వుతో ఆరణి శ్రీనివాసులు ముందుకు సాగారు. గంటపాటు నడిచిన అనంతరం యోగా మాస్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆరణి శ్రీనివాసులు కొంత సేపు ధ్యానం చేశారు. వాకర్స్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన మజ్జిగను వాకర్స్‌కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ నడకతో మన నడత మారుతుందన్నారు. నడకతో క్రమశిక్షణతో పాటు ఏరోజు పనులు అదే రోజు ముగించే శక్తి మనకు అలవాటు అవుతుందని ఆయన చెప్పారు. నడక వల్ల బాడీ ఫిటెనెస్ తోపాటు జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయా మం తప్పనిసరిగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు బాలాజీ నాయుడు, శివ రెడ్డి, జానకిరామ నాయుడు, కృష్ణంరాజు, యోగ వెంకటేష్, తెలుగుదేశం నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య, వెంకట్ రత్నం, జనసేన నాయకులు బెల్లంకొండ సురేష్, బండ్ల లక్ష్మిపతి, నీలాద్రి రాయల్ పాల్గొన్నారు......



## పారిశుధ్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టండి

**- వాకర్స్ కూర్చునేందుకు బెంచులు ఏర్పాటు చేయండి**
**- కమిషనర్ అదితి సింగ్**

**తిరుపతి మున్సిపాలిటీ, మేజర్‌న్యూస్:** నగరంలో పారిశుధ్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని, గొల్లవాణిగుంట వాకింగ్ ట్రాక్ పక్కన కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ ఆరోగ్య, పారిశుధ్ధ్య విభాగపు సిబ్బందిని ఆదేశించారు. శనివారం తెల్లవారజామున నుండి నగరంలో లీలా మహల్ కూడలి, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, బాలాజీ కాలనీ, బేరి వీధి, కర్నాల వీధి, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆటోనగర్ సమీపంలోని గొల్లవాని గుంట బండ్ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అన్నారు. అలాగే మురుగునీటి కాలువల్లో చెత్త చెదారం నిలవకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. రోజు వాహనాలు ఇంటికి వెళుతున్నా కొంతమంది గోతాల్లో చెత్త వేసి వీధుల్లో వేస్తున్నారని సిబ్బంది తెలిపారు. రోడ్లపైనే, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి అపరాధ రుసుము విధించాలని అన్నారు. మార్కెట్లో ఎక్కడపడితే అక్కడ చెత్త ఉందని, ప్రతి రోజూ బాగా శుభ్రం చేయాలని అన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అన్నారు. ఇంజినీరింగ్, పారిశుధ్ధ్య సిబ్బంది ఒక అవగాహనతో పనిచేసి ఎక్కడా కాలువల్లో చెత్త నిలవకుండా శుభ్రం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ , శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతీ, మేస్త్రీలు తదితరులు ఉన్నారు. అనంతరం ఆటోనగర్ సమీపంలోని గొల్లవానిగుంటలో ఉన్న స్టేడియం, బండ్ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్టేడియం లో ఇంకా పెండింగ్ లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే బండ్ పైన ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఫౌంటెన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. నడక కోసం వచ్చే వారు కొంతసేపు కూర్చునేందుకు వీలుగా అక్కడక్కడా బెంచీలు ఏర్పాటు ఏర్పాటు చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, అనిల్, కాంట్రాక్టర్ సంతోష్ తదితరులు ఉన్నారు.





## వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం



**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** పట్టణంలోని కరణాల వీధిలో వెలసి ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్స వాలు వైభవంగా సాగుతున్నాయి. స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ ఏర్పాటు చేసి దాతల సహకారంతో నూతనంగా తయారు చేయించిన రథంలో నిలిపి మంగళ వాయిద్యాలతో పట్టణ పురవీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో మేజర్ పంచాయతీ కార్యాలయం ఉన్న గ్రంథాలయంలో జరుగుచున్నటువంటి సమ్మర్ క్యాంప్‌లో మాధవ రెడ్డి ,సీనియర్ తెలుగు పండితులు విచ్చేసి, విద్యార్థినీ విద్యార్థులకు నీతి కథలు, నీతి పద్యాలు, బోధించినారు. మిత్ర లాభము, మిత్రభేదము కథలు, మరియు వేమన శతకము, సుమతి శతకముల గురించి, అందులోని పద్యములు, భావములు, చెప్పి పిల్లలకి ఆహ్లాదం కలిగించినారు. నీతి కథలులో తల్లి, తండ్రి, గురువు ,దైవము యొక్క ప్రాముఖ్యతను గురించి తెలియపరిచినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శంకర్ బాబు మరియు రాఘవేంద్ర రాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం.



**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ,విజయవాడ రైల్వే డివిజన్ డి.ఆర్.యు.సి.సి. మెంబర్ రొటేరియన్ (మయూరి శ్యామ్ యాదవ్) దాతృతమ్ తో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో గుడూరు పట్టణం గమళ్ళపాలెంలో ఉన్న ఓం సాయి రాం వసతి గృహం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ మా అమ్మ ద్వారా ఈ వృద్ధాశ్రయం కి వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు.. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ , రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి, రామ్మోహన్ ,బలరాం రెడ్డి, కేర్ టేకర్ కళ్యాణి పాల్గొన్నారు.

## యువిక - 2024 కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు



**సూళ్లూరుపేట మేజర్‌న్యూస్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ భారతదేశ వ్యాప్తముగా ఉన్న ఇస్రో కేంద్రాలలో రెండు వారాల పాటు నిర్వహించిన యువిక - 2024 కార్యక్రమం ముగిసింది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 355 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొనడం జరిగింది. సైన్సు పట్ల అవగాహన కల్పిస్తూ అంతరిక్ష పరిశోధనల వైపు విద్యార్థులను ఆకర్షించడానికి ప్రతియేటా ఈ కార్యక్రమాన్ని ఇస్రో నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా షార్ కేంద్రం లో 51 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భముగా బ్రహ్మప్రకాష్ హాలు లో జరిగిన ముగింపు వేడుకల్లో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ దేశ వ్యాప్తముగా శిక్షణ పొందిన విద్యార్థులతో బెంగుళూరు నుండి వర్చువల్ పద్ధతిలో పాల్గొన్నారు. ముఖా ముఖి మాట్లాడి అనంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రసంగించారు.

## బైకును ఢీకొన్న లారీ - వ్యక్తికి గాయాలు

**నాయుడుపేట మేజర్‌న్యూస్:** నాయుడుపేటలోని మర్లపల్లి జాతీయ రహదారిపై శనివారం రాత్రి సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో లారీ బైకును ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాల పాలైన వ్యక్తిని ఆటోలో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. బైకును ఢీకొన్న తర్వాత లారీ పరారు అవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుడు శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్లు కు చెందిన చంగల్ రాయలు రెడ్డిగా గుర్తింపు.



# చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, థామస్ అఖండ మెజారిటీతో గెలవాలి

### - ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో టీడీపీ నేతల పూజలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ థామస్, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ యుగంధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవకార్వేటి నగరం మండల నాయకులు పాల్గొన్నారు.



# పులిపత్తి నానిని పరామర్శించిన టీడీపీ నేత గాలి మురళి నాయుడు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** చిత్తూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి చంద్రగిరి నియోజకవర్గం అభ్యర్థి పులివర్తి నానిని తొట్టం బేడు పార్టీ అధ్యక్షులు గాలి మురళీ నాయుడు శనివారం పరామర్శించారు. మే 13 వతేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు ఇవియం బ్యాలెట్లును భద్రపరచు దగ్గర పులివర్తి నాని పరిశీలిస్తుండగా అధికార పార్టీ నాయకులు ఒక పథకం ప్రకారం సుత్తితో ఇనప రాడ్లతో పులివర్తి నాని కారు ధ్వంసం చేయడమే కాకుండా అయనపై దాడి చేసి హత్యా యత్నానికి పాల్పడడం ఎంత వరకు సమంజసమని, ప్రజా మద్దతు ఉంటే ప్రజల్లో గెలవాలే తప్ప ఇటువంటి కుట్ర రాజకీయాలుకు పాల్పడడం మంచి పద్దతి కాదని హితువు పలికారు. మీరు త్వరగా ఆరోగ్యంగా కోలుకుని చంద్రగిరి నియోజకవర్గం ప్రజలకు మేలు చెయ్యాలని కలియుగం ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉంటాయని కోరుకుంటూ, చిత్తూరు వారి స్వగృహంలో పులివర్తి నానిని పరామర్శించిన మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, యస్ సి సెల్ నాయకులు సాలి రాజ, గోరింట్ల రూప్ చౌదరి, తిరుకాల హరి గౌడ్, కొణతం గౌరిశంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



పులివర్తి నానితో గాలి మురళి నాయుడు

# సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం

**నాయుడుపేట, మేజర్ న్యూస్:** సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని సూళ్లూరుపేట నియోజకవర్గ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్ అన్నారు. శనివారం ఆయన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్యను నెల్లూరు అయ్యప్ప గుడి సెంటర్‌లో ఉన్న బిసి స్టూడెంట్ ఫెడరేషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జువ్వలపాటి మస్తాన్ ఉల్లిపాయల శంకరయ్యకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీలను వేయాలని ఆదేశించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ ఆధ్వర్యంలో త్వరలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పేద విద్యార్థులకు, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ద్వారా సహాయం అందిస్తామని తెలిపారు.



# న్యాయవాది ఈశ్వరయ్యకు పరామర్శ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** న్యాయవాది ఈశ్వరయ్యను జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. ఈనెల 20వ తేదీన సోమవారం రేణిగుంట రోడ్డులోని హీరో హోండా షోరూం వద్ద గుర్తు తెలియని వాహనం ఈశ్వరయ్యను ఢీకొనడంతో ప్రమాదానికి గురిఅయ్యారు. ఈశ్వరయ్యకు తీవ్ర గాయాలు కావడంతో నారాయణద్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు శనివారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఈశ్వరయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను ఆరణి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు దినకర్, కంచి ప్రవీణ్ కుమార్, లగిశెట్టి వెంకటరమణ, గాలి శ్రీనివాసులు, అప్పిలి ఉమాపతి పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల వెంటే

**- మాజీ ఎంపి చింతామోహన్**



**సూళ్లూరుపేట మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారికి, ఓటు వేయని వారికి మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ధన్యవాదాలు తెలియజేసారు, శనివారం స్థానిక బస్టాండ్ సమీపంలో జరిగిన విలేకర్ల సమావేశంలో చింత మోహన్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో మేము గెలిచినా ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటామని, ప్రజా సమస్యల పై నిత్యం పోరాడతామని ఈ ప్రాంతంలో ఉన్న శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు దుర్భలంగా ఉన్నాయని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయనున్నట్లు చింతా మోహన్ తెలియజేసారు. భారతదేశ ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## బొజ్జల సుధీర్ గెలుపు కోసం పాదయాత్ర

**- మహబూబ్ బాషా**



**రేణిగుంట, మేజర్ న్యూస్:** అన్ని మతాల దేవుడు ఆశీస్సులు టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి కూటమి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, శ్రీకాళహస్తి నియోజకవర్గం కూటమి అభ్యర్థి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డికి అన్ని మతాల దేవుళ్ళ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్న రేణిగుంట పట్టణ టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పట్టణ మండల నాయకులు పాదయాత్ర చేపట్టారు. శనివారం రేణిగుంట పట్టణంలో మేరీ మాత చర్చి నుండి ప్రారంభమైన పాద యాత్ర సూళ్లూరుపేట చెంగాలమ్మ గుడిని సందర్శించి అనంతరం వేనాడు దర్గా వరకు పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. వీరికి మునస్వామి నాయుడు, కెన్నన్ రెడ్డి, కిరణ్ కుమార్ ,దినేష్ తేజ జగదీష్, వీరికి సంఘీభావం తెలిపిన తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాదం టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వరరావు మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేతల దాడి

**రామకుప్పం, మేజర్‌న్యూస్:** రామకుప్పం మండలం 89 పెద్దూరు గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై స్థానిక వైసీపీ ఎంపీటీసీ వెంకటరమణ దాడి చేయడంతో వెంకటేశ్, సీనప్ప స్వల్పంగా గాయపడగా, శేషప్ప తీవ్రంగా గాయపడ్డాడు. శాసనసభ ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించ లేదనే నెపంతో వారు దాడులు చేసినట్లు బాధితులు ఆరోపించారు. తీవ్రంగా గాయపడిన బాధితులని కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించి, పోలీసులకు సమాచారం అందించామన్నారు.




గాయపడిన శేషాద్రీనీ పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, రామకుప్పం మండల తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు

## దివ్యాగునికి మూడు చక్రాల సైకిల్ వితరణ



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో తూకివాక గ్రామంలోని ఎం.బాలయ్య అనే వికలాంగుడికి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ సుధాకర్ ఆర్థిక సహాయంతో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిల్ ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవ చేసే గుణాన్ని అవలంబించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆషా సంస్థ కమిటీ సభ్యులు రమేష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పేదలకు అల్పాహారం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మున్సిపల్ పార్కు వాకర్స్ అసోసియేషన్, టిడిపి బీసీ సాధికారక కమిటీ సభ్యులు జగన్నాథం ఆర్గానిక్ యోగ బృందంతో కలిసి పేదలకు ఆర్గానిక్ పండ్లు, అల్పాహారం, మజ్జిగ పంచిపెట్టారు. ఈ మేరకు శనివారం నగర పరిధిలోని వివిధ ప్రాంతాలలో 50 మంది నిరాశ్రయులు, పేదలు అనాధలు, కుష్టి వ్యాధితో బాధపడుతున్న అభాగ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం సేవ దృక్పథంతో అనాధలకు అంటగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నేడు ఆర్గానిక్ మామిడి పండ్లు, అల్పాహారం, వితరణగా అందజేశామని, నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు వెంకట పుష్పావతి, పతాంజలి బృందం చంద్రమౌళి, పతాంజలి బృందం పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో భక్తి భావం పెంపునకు సంకీర్తన

## : గుండాల గోపీనాథ్ రెడ్డి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** శ్రీవారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి తిరుపతికి విచ్చేసి భక్తులలో ఆధ్యాత్మికతో పాటు వారిలో భక్తి భావం పెంచి తిరుపతి నగర కీర్తి ప్రతిష్టను పెంచేందుకు నగర సంకీర్తన దోహదం పడుతుందని నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు. నగర ప్రజలలో మరింత భక్తి భావం, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని సంకల్పంతో స్థానిక రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి నగర సంకీర్తన మండలి ఏర్పాటు చేసి నగరంలో ప్రతి శనివారం భజన మండలి కళాకారుల చేత సంకీర్తన గోష్టి నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం భజన మండలి కళాకారులు సాంప్రదాయ వస్త్రాలతో గోవిందరాజు స్వామి ఆలయం నుంచి నాలుగు మాడ వీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. నగర సంకీర్తన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన సభ్యులు తిరుపాలాచారి వాసు రెడ్డి మునినాధారెడ్డి, కాస్ప పద్నాభం, చంద్ర బాబు నాయుడు కొండె చెంగారెడ్డి, శంభోల హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్వతి, పద్మ, ఉషారాణి, కల్పన, జయమ్మ, మునికుమారి, సుశీల, మహాలక్ష్మి, నరసింహారెడ్డి, నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, వాసు, సాయిరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి... అపూర్వస్పందన

**ఎస్ఆర్ పురం, మేజర్ న్యూస్:** మండలంలోని తయ్యూరు పాయకట్టు అంకనపల్లె ధర్మరాజులు దేవస్థానం వద్ద ఆర్వీఎస్ చిత్తూరు ఆసుపత్రి వారు శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. డాక్టర్ ఖలీద్, డాక్టర్ భవిత ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు. దాదాపు 100 మందికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిం చారు. సాధారణ వైద్య పరీక్షలు, ఆర్తో, గైనకాలజీ లాంటి జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని గుర్తించి తమ ఆసుపత్రిలో చేరాలని సూచించారు. వీరికి ఉచిత బస్సుతోపాటు వైద్య సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాలతి, జ్యోతిక, సుబ్రమణ్యం, వరకుమార్ యోగ ఆచార్యులు గోవింద స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



**వైద్య శిబిరంలో కంటి పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ ఖలీద్**

# నానిని పరామర్శించిన రాజేంద్రప్రసాద్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** చంద్రగిరి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య పరామర్శించారు. ఇటీవల శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద వైసిపికి చెందిన కొందరు అల్లరి మూకలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో తీవ్ర గాయాలై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న నానిని శనివారం పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ ఓటమి తప్పదని తెలిసి తెలుసుకొని జీర్ణించుకోలేక తెలుగుదేశం అభ్యర్థులపై వైసీపీ రౌడీలు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. నాని పై దాడిని ఖండిస్తూ వైసీపీ అనైతిక చర్యలను ఖండించారు. రాబోయే ఫలితాల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా అభివృద్ధి చేస్తారని ఆకాంక్షించారు. వైసిపి చిల్లరి ఆటలు చెల్లవని ఇప్పటికైనా వైసిపి తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ యాదవ్, కిరణ్ యాదవ్, సురేంద్ర రాజు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైద్యులు అందుబాటులో ఉంటే వెంకటేశ్ మృతిచెందేవాడా?

**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** గుండెపోటుతో హమాలీ వెంకటేశు మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లి లో చోటు చేసుకుంది కుటుంబ సభ్యుల కథనం మేరకు... పట్టణంలోని నేతాజీ నగర్ వెంకటేశు(56) హమాలీగా పని చేస్తున్నాడు ఈ క్రమంలో స్థానికంగా ఓ లారీ నుంచి ఎరువుల బస్తాలు దించిన తర్వాత హమాలీలంతా విశ్రాంతి తీసుకు న్నారు. నీళ్లు తాగిన వెంకటేశు వెంటనే కుప్పకూలిపోయాడు. గుర్తించిన చుట్టుపక్కల హమాలీలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేరు స్టాఫ్ నర్స్ ప్రాథమిక చికిత్స అందించారు. ఇంతలోనే వెంకటేష్ మృతి చెందడం జరిగింది. గుండెపోటు వచ్చిన 30 నుంచి 40 నిమిషాల వ్యవధిలో సిపిఆర్ నిర్వహించినట్లయితే రోగి బతికే అవకాశం ఉందని వైద్య పరి జ్ఞానం తెలియజేస్తున్నది. చౌడేపల్లి ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేరని ఎన్నిసార్లు వార్తాపత్రికల్లో వార్తాకథనాలు వచ్చినా స్పందించని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యుడు అందు బాటులో ఉండి ఉంటే ప్రాణం దక్కేదని స్థానికులు చర్చించుకోవడం విశేషం. పై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడం కూడా హాస్పిటల్ ఈ దుస్థితికి కారణమని స్థానికుల భావన. హమాలీల వాల్మీకి సంఘ నాయకుడుగా ఆయన మండలానికి సుపరిచితుడు అందరిలోనూ మంచి పేరు తెచ్చుకున్న వెంకటేష్ మృతి చెందడంతో పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు.



# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



**తిరుమల, మేజర్‌న్యూస్:** వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు నిండి పోయి ఔటర్ రింగ్ రోడ్డులోని శిలా తోర ణం వరకు క్యూలైన్ వ్యాపించి ఉంది. వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. గత 10 రోజుల్లో శ్రీవారి మెట్టు, అలిపిరి నడక మార్గాల్లో దాదాపు 2.60లక్షల మంది భక్తులు తిరు మలకు చేరుకొని శ్రీవారిని దర్శించుకు న్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవ నాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, త్రాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, ఆరోగ్య, విజిలెన్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని కీలక ప్రదేశాల్లో సేవలందిస్తున్నారు.

ఇందులో భాగంగా శిలాతోరణం, బాట గంగమ్మ గుడి, మార్గాలలో శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తుల సౌకర్యార్థం 27 ప్రాంతాల్లో తాగు నీరు, 4 ప్రాంతల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అక్టోపస్ భవనం నుండి శిలాతోరణం వరకు ప్రత్యేకంగా 8 బస్సులు ఏర్పాటు చేసి ప్రతి నిమిషానికి భక్తులను చేరవేసేలా చర్యలు తీసుకున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద సముదాయంలోనే మధ్యాహ్ననికి దాదాపు 60వేల మందికి పైగా అన్న ప్రసా దం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 50వేల మందికి అన్న ప్రసా దాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. సాధారణం కంటే రెట్టిం పుగా అన్న ప్రసాదాలు అందించారు. అంతే కాకుండా పిల్లలకు పాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. క్యూలైన్లలో ఎలాంటి తొక్కిస లాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నా రు. శనివారం సాయంత్రం 5 గంటల వ ంకు 46,486మంది యాత్రికులు శ్రీవేంక టేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

# దేవస్థానం పైభాగం లీకేజీల నివారణ పనులు ప్రారంభం

### దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం పైభాగంలో చినుకు పడితే చిత్తడిగా మారుతున్న శ్రీకాళహస్తీశ్వర ఆల యంలో లీకేజీ నివారణ పనులను రింకు ఇంటర్నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ శనివారం లీకేజీ నివారణ పనులు ప్రారంభించింది. సుమారు నాలుగు కోట్ల రూపాయల అంచనాలతో స్వచ్ఛందంగా పనులను రింకు సంస్థ నిర్వహిస్తుంది. లీకేజీ నివారణ పనులను దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. రింకు ఇంటర్నేషనల్ సంస్థ దాతగా వ్యవహరిస్తూ పనులు చేపట్టడం పురాతన ఆలయాన్ని పురాతన పద్ధతిలోనే నేచురల్ మెటీరియల్స్ వినియోగిస్తూ లీకేజీ అరికట్టే పనులు చేపట్టడం హర్షనీయమని అన్నారు. గడిచిన దశాబ్ద కాలంగా శ్రీకాళహస్తి ఆలయంలో లీకేజీలు నివారణ పెద్ద సమస్యగా తయారైంది. ఆలయం పైభాగంలో ఏర్పడిన కంటికి కనిపించని పగుళ్ల ద్వారా వర్షాలకు వర్షపు నీరు ఆలయంలోపలికి లీకేజీ ద్వారా వెల్లివెత్తుతుంది.ప్రధానంగా అమ్మవారి ఆలయం ప్రాంతమంతా చిత్తడి గా మారుతుంది. గతంలో ఆలయంలోకి లీకేజీలు, భక్త కన్నప్ప కొండ వైపునుంచి సీపేజీ అధికంగా వచ్చేది. అయితే దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చెన్నై తిరుపతి ఐఐటి నిపుణులు, ఇతర ఇంజనీ రింగ్ నిపుణులు పరిశీలన చేసి, పలు సంస్థల ద్వారా లీకేజీ నివా ణ పనులు నిర్వహించారు. ఇప్పటికి మూడుసార్లు లీకేజీ నివారణ పనులు నిర్వహించినప్పటికీ పూర్తిస్థాయిలో లీకేజీలను నివారించలేక పోయారు. ప్రధానంగా అమ్మవారి ఆలయం పరిసరాలు లీకేజీలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి మరోసారి తిరుపతి ఐఐటి నిపుణులు, ఇతర ఇంజనీరింగ్ శాఖ నిపుణులు సలహాలు సూచనలు నేపథ్యంలో శ్రీకాళహస్తి ఆలయానికి దర్శనానికి విచ్చేసిన రింకు ఇంటర్నేషనల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ కంపెనీ యజమానులు ఆలయం లోపల లీకేజీ సమస్యను తెలుసుకొని తమ సంస్థ ద్వారా



పనులు చేపడతామని ముందుకు వచ్చారు. సుమారు నాలుగు కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని పూర్తిగా భారాన్ని తమ కంపెనీ దాతగా భరిస్తుందని హామీ ఇచ్చారు. పనులు కూడా పూర్తిగా పురాతన కాలం నాటి ఆలయ నిర్మాణాలకు వినియోగించే సహజ సిద్ధ మెటీరియల్స్ వినియోగించి పనులు చేస్తామని తెలిపారు. ఈ మేరకు లీకేజీ నివారణ పనులను రింకు ఇంటర్నేషనల్ సంస్థ ప్రారంభించి ముమ్మరంగా నిర్వహిస్తుంది. పనులను శనివారం దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించి కంపెనీ ప్రతినిధులను పనులు చేస్తున్న వైనంపై అడిగి తెలుసుకున్నారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ పురాతన ఆలయమైన శ్రీకాళహాలయంలో ఏర్పడిన లీకేజీ సమస్యలను పరిష్కారానికి రింకు ఇంటర్నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ముందుకు రావడం, దాతగా ఖర్చును భరిస్తూ సమస్యను పరిష్కరించే విధంగా పనులు చేపట్టడం హర్షనియమన్నారు. నాలుగు కోట్ల రూపాయలతో పనులు చేపట్టిన సంస్థ అవసరమైతే మరో నాలుగు కోట్లు అయినా భరించి ఆలయంలో లీకేజీ నివారణ చేస్తామని పనులు చేపట్టడం అభి నందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు. పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# 16ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### నలుగురు స్మగ్లర్లు అరెస్టు.. ఒక టెంపో ట్రావెలర్, ఒక కారు స్వాధీనం

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** పెంచలకోన సమీపంలోని రాపూరు వద్ద 16 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక టెంపోట్రావెలర్, మరో కారును టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబ ంధించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఐ (రిజర్వు) కే.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు కేఎస్కే లింగాధర్, కే.సురేష్‌బాబు టీమ్‌లు శుక్రవారం సాయంత్రం తిరుపతి నుంచి రాపూరు వరకు లోడింగ్, డంపింగ్ పాయింట్లను తనిఖీ చేస్తూ వెళ్లారు. రాపూరు నుంచి ఎగువపల్లి అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున రెండు వాహనాలు అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడకు చేరుకున్నారు. వాహనాల్లో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండంతో వారిని చుట్టు ముట్టారు. కొందరు పారి పోగా నలుగురిని పట్టుగోగలిగారు. వారిని తమిళనాడు



తిరువన్నామలైకు చెందిన అన్బళగన్ (41), చిత్తూరు టౌన్‌కు చెందిన అసిఫ్ బాషా (21),ముత్తు (33), సెల్వం (30)లుగా గుర్తించారు. వీరి నుంచి 16 ఎర్రచందనం దుంగలు, ఒక టెంపో ట్రావెలర్, కారు, మూడు ఫాస్టాగ్‌లు, 3 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోర్సు పోర్సు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. వీటి విలువ రూ.40 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.. ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి రివార్డులు కోసం సిఫారసు చేశారు.

# అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మ వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ.రవికుమార్ శనివారం



కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు వేద ఆశీర్వాదం చేసి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో తిరుపతి ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రాంగోపాల్, మొదటి జూనియర్ సివిల్ జడ్జ్ సత్య కాంత్ కుమార్, ప్రోటోకాల్ ఇంచార్జ్ ధనుంజయ నాయుడు, ఆలయ ఏఈఓ రమేష్, సూపర్డెంట్ మధు, విఐ బ్రహ్మానంద రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జనం కోసమే
సూర్య
నేటి దినపత్రిక సూర్యలో జర్నలిజంలో ఆసక్తి కలవారు తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, ఓజిలి, వెంకటగిరి నియోజకవర్గం నుండి బాలాయపల్లికి ఇంచార్జులు కావలెను. మరిన్ని వివరాల కొరకు కింద కనబరచిన వారిని సంప్రదించగలరు.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116